ఇద్దరు టీచర్లకు షోకాజ్‌లు

ప్రజాశక్తి - పార్వతీపురం

పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఈ పాఠశాల లో పల్లె నిద్ర చేసిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పాఠశాల విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించారు. ఇంగ్లీషు, లెక్కలు సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రమాణాలు బాగా లేవని కలెక్టర్ నిర్ధారించారు. ఈ మేరకు ఇంగ్లీష్, లెక్కలు సబ్జెక్టు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని గిరిజన సంక్షేమ డిడి గయాజుద్దీన్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డిడి గయాజుద్దీన్ చెప్పారు.

పల్లె పండగ పనులన్నీ ప్రారంభించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పల్లె పండుగ కార్యక్రమం కింద జిల్లాలో చేపట్టిన పనులన్నీ ప్రారంభించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తికావాలని ప్రభుత్వం నిర్దేశించిందని, కావున జిల్లాలో డిసెంబర్ నెలాఖరుకు అన్ని పనులు పూర్తికావాలని తేల్చిచెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన 521 పనుల్లో 386 పనులు ఇంతవరకు ప్రారంభం కాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. వారంలోగా పనులన్నీ ప్రారంభించి, వచ్చే నెలలోగా పూర్తికావాలని అన్నారు. పనుల ప్రగతిలో నిర్లక్ష్యం వహించిన కురుపాం, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు ఎఇఇలకు ఛార్జ్ మెమోలు జారీచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్లె పండుగ పనుల ప్రగతిపై ఇఇలు, డిఇఇలు, ఎఇఇలతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో రహదారుల్లేని గ్రామాలు చాలా ఉన్నాయని, పల్లె పండుగ కింద రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడం పట్ల కలెక్టర్ మండిపడ్డారు. గుత్తేదారులతో పనులు చేయించాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అధికారులదేనన్నారు. పనిచేయని కాంట్రాక్టర్లను తొలగించి, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని, ప్రారంభం కాని చోట్ల తక్షణమే ప్రారంభించాలని చెప్పారు. రహదారులు, వంతెనలు, కల్వర్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ముందుగా పనులు పూర్తి చేసిన వారికి ముందుగా చెల్లింపులు జరుగుతాయని, కొత్త పనులు కూడా చేసుకునే అవకాశం ఉందని, కొత్త పనులకు అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. రహదారి సౌకర్యం లేని 19 గిరిజన గ్రామాల్లో అంచనాలను రూపొందించి, తీర్మానం చేసుకొని తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు వారి పరిధిలోని పారిశుద్ధ్యం, ఒడిఎఫ్, రహదారులు, కాలువలపై దృష్టి సారించాలన్నారు. మరుగుదొడ్లు లేని వారు కొత్తగా మరుగుదొడ్లను నిర్మించుకోవచ్చని, ఇందుకు రూ.15 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ఒడిఎఫ్, గార్బేజ్ ఫ్రీ గ్రామాలు తయారు కావాలని, ఆ దిశగా ఇంజినీర్లు కృషి చేసి, గ్రామాల్లో మార్పును తీసుకురావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశం లో పంచాయతీ రాజ్, ఐటిడిఎల పరిధిలోని ఇఇలు, డిఇఇలు, ఎఇఇలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

విద్యార్థుల సంరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల సంరక్షణ బాధ్యత సంబంధిత ఉపాధ్యాయులదేనని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ సంక్షేమ అధికారులు, డిప్యూటీ వార్డెన్లతో సమావేశాన్ని స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్రతి ఉపాధ్యా యుడు 20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని, వారి విద్య, ఆరోగ్యం, నడవడికపై దృష్టి, ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. పాఠశాలల్లోని పీడి, పిఇటిలు ప్రతి రోజూ ఉదయం 05.30గం.ల నుంచి సాయంత్రం వరకు పిల్లలచే నిర్వహించాల్సిన కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. చికెన్, గుడ్డు ఇచ్చే రోజుల్లో సిక్ బోర్డర్స్ వున్న చోట, వారికి తప్పక వెజిటేరియన్ కూరలు ఇవ్వాలని పేర్కొన్నారు. మరుగుదొడ్లు, స్నానాల గదులలో నిత్యం నీటిని సరఫరా చేసి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వాటిని శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల పరిసరాల్లో 100 మీటర్ల దూరం వరకు వున్నా దుకాణాల్లో ఎటువంటి మత్తు, పొగాకు సంబంధిత వస్తువులను విక్రయించకుండా నిషేధించాలని స్పష్టం చేశారు. మత్తు పదార్థాలు ఉన్నట్లు భావిస్తే పై అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి, సహాయ గిరిజన సంక్షేమ అధికారి, సాలూరు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జిసిడి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు మరమ్మతు పనులు : డిఇ

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు మరమ్మతుకు గురైన అంతరాష్ట్ర రహదారి మరమ్మతు పనులు వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు రోడ్డు, భవనాల శాఖ డిఇ అప్పాజీ అన్నారు. కొమరాడలో చేపడుతున్న మరమ్మతులు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులు వేగవంతంగా చేసేందుకు ఎప్పటికప్పుడు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో వేగవంతంగా జరుగుతున్నయని తెలిపారు. మధ్యలో కొన్ని సాంకేతిక సమస్యల వల్ల పనులు నిలిపివేశామని, మళ్లీ పనులు ప్రారంభించామని తెలిపారు. ప్రజలకు, ప్రయాణికులకు, వాహనదారులకు రోడ్డు గోతులు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడిన విషయమై ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ రోడ్డు మరమ్మతులకు కోటి రూపాయల వరకు నిధులు మంజూరు కావడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డ ప్రదేశాల్లో పనులు చేస్తున్నట్లు తెలిపారు. పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఎటువంటి నాణ్యతా లోపాలు కనిపించకుండా నాణ్యతతో చేయించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. పనుల పర్యవేక్షణలో ఆర్అండ్ బి జెఇ రాజేంద్ర, సిబ్బంది ఉన్నారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - పాచిపెంట

గంజాయి సాగు అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు గుర్తించేందుకు డ్రోన్ల సహాయంతో సర్వే ప్రక్రియ ప్రారంభించామన్నారు. అలాగే పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణాదారులను పట్టుకుంటున్నప్పటికీ అడ్డదారుల గుండా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పెద్ద ఎత్తున ఒడిశా నుంచి బస్సులు, ద్విచక్ర వాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందన్నారు. ఈ అక్రమ రవాణాకు మహిళలను కూడా ఉపయోగిస్తున్నారన్నారు. మాస్క్ డాగ్‌ల ద్వారా గంజాయి అక్రమ రవాణా గుర్తించి పట్టుకుంటున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణా పూర్తిస్థాయి నియంత్రణకు ఒడిశా ప్రభుత్వం సంబంధిత టాస్క్ ఫోర్స్ అధికారులతో చర్చలు జరపామన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు సంచరిస్తే అదుపులోకి తీసుకొని తనిఖీలు నిర్వహించి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు అలాగే ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూసేందుకు పాఠశాలలు, కళాశాలల వద్ద అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైన విద్యార్థులను గుర్తించి సమాచారమిస్తే వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. అలాగే నాటు సారా అక్రమ రవాణా నియంత్రణకు మావోయిస్టులు ఈ ప్రాంతంలో లేనప్పటికీ ప్రత్యేక నిఘానేత్రాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. సిబ్బందిని కూడా ఈ విషయంలో అప్రమత్తం చేస్తున్నామన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. అలాగే పి.కోనవలస చెక్ పోస్ట్, ఘాట్ రోడ్డు, పి.కోన వలస ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట ఎఎస్‌పి అంకిత సరానా, సిఐ రామకృష్ణ, ఎస్సై వెంకట సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి, ఎఎస్‌పి సురానా

సాలూరు: స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ఆయనతో పాటు ఎఎస్పీ అంకిత సురానా కూడా హాజరయ్యారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి రూరల్, టౌన్ సిఐలకు సూచనలు చేశారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సిఐలు రామకృష్ణ, అప్పలనాయుడు వున్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిఐడి డిఎస్‌పి భూపాల్

అంటరానితనం, వివక్ష చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -భామిని

అంటరానితనం, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను తొలగించి, సమాజంలో గల దళిత, గిరిజనులకు రక్షణ కల్పించేందుకు రాజ్యాంగంలో పొందుపర్చిందే ఎస్‌సి, ఎస్‌టి పిఒఎ చట్టమని విశాఖ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగం (సిఐడి) డిఎస్పీ ఎంఎన్ భూపాల్ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం విశాఖ సిఐడి డిఎస్‌పి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ పిఒఎ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత పాలకొండ ఎస్‌డిపిఒ రాంబాబు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. అవగాహన ఉంటే సమాజంలో నడవడిక ధోరణి సక్రమంగా ఉంటుందన్నారు. ఒక నేరం చేస్తే దాని పర్యవసానం ఏమిటని అర్థమవుతుందన్నారు. సిఐడి డిఎస్‌పి భూపాల్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలపై దాడి చేస్తే సదరు బాధితుడికి ఎస్‌సి, ఎస్‌టి పిఒఎ చట్టం ఏ విధంగా రక్షణ కల్పించి, న్యాయం చేస్తుంది, బాధితుడికి ఎటువంటి శిక్ష అవుతుంది, ఇటువంటి కేసుల్లో కోర్టులు, పోలీస్ అధికారులు ఏ విధంగా కేసు నమోదు చేస్తారు అంశాలను వివరించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉంటే అది అందరికీ చేరుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎస్‌సి, ఎస్ టి చట్టాలపై పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐడి ఇన్‌స్పెక్టర్లు ఎంవి రమణమూర్తి, వై.రవి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.అప్పా రావు, తహశీల్దార్ అప్పారావు, ఎంపిడిఒ చంద్రరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్, విశాఖ సిఐడి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

జన జాతీయ గౌరవ దివస్ సందర్భంగా ఈనెల 15నుంచి 26 వరకు ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, ఆర్చరీ, జావలిన్ త్రో, వాలీబాల్ విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించాలని ఐటిడిఎపిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 15న విద్యార్థులకు క్లస్టర్ స్థాయిలో పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి ఈనెల 20న ఐటిడిఎ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఈనెల 15న అన్ని పాఠశాలల్లో గిరిజన స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పుష్పమాలంకరణ చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో కనీసం రెండు రకాల మొక్కలను విద్యార్థులచే నాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక వైద్యాధికారులను ఆహ్వానించి సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డిఎంహెచ్‌ఒకు వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు మన్యం జిల్లా డిఎంహెచ్వో డాక్టర్ విజయ పార్వతికి బుధవారం వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా శ్రామిక మహిళా సంఘం, సిఐటియు నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ ఆశ వర్కర్లకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. పని భారం తగ్గించాలని, కొత్త సెల్ ఫోన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ సౌకర్యం, మట్టి ఖర్చులు అందజేయాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశలుగా గుర్తించాలని, ఇతర సమస్యల పరిష్కరించాలని, కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 18న ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. వినతిని అందజేసిన వారిలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి జివి రమణ, బి.సూరిబాబు, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : వేతనాలు పెంచాలని, గతంలో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలకు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా హాస్పిటల్ ఆవరణంలో ఎపి ఆశా వర్కర్ల యూనియన్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ హామీల్లో భాగంగా ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త రికార్డులు ఆశా వర్కర్లకు ఇవ్వాల్సి ఉన్నా నేటికీ ఇవ్వలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలో ఆశాలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు గెమ్మెల నీలమ్మ, పి.గంగ, డి.నిర్మల, కె.గంగ, మాధవి, వై.రాధ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పట్టణంలోని ప్రతి ఒక్కరి సహకారంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం కల సాకారమవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత తోనే మార్పు సాధ్యమౌతుందని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మృత్యుంజయ ఆడిటోరియంలో స్వచ్ఛ సుందర పార్వతీపురంపై అవగాహన సదస్సు కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు జిల్లాలో ఎక్కువగా ప్రబలుతున్నాయని, ఇందుకు అపారిశుధ్యమే కారణమని అన్నారు. తద్వారా దోమలు పెరిగేందుకు అవకాశం ఉందని చెప్పారు. వీటి నిర్మూలనకు పారిశుధ్య మాసోత్సవాలతో పాటు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వంతో పాటు ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛ సుందరంగా పట్టణం మార్పు రాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో జట్టు ఆశ్రమం అందిస్తున్న సేవలు తమ భావాలకు అనుగుణంగా ఉన్నాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. జట్టుతో పాటు లయన్స్, రోటరీ, సత్యసాయి, ఇతర స్వచ్ఛంద సంస్థలు చాలా జిల్లాలో ఉన్నాయని అన్నారు. నిబద్ధతతో పనిచేసే అధికారులు, స్వచ్ఛ ప్రేమికులు కూడా ఉన్నారని, వీరందరి సహకారం, భాగస్వామ్యంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం కలను నిజం చేయవచ్చని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతిలో వ్యర్థ పదార్థం అనేది ఏదీ ఉండబోదని, సరైన రీతిలో ఉపయోగించుకోవడం ద్వారా సంపదను సృష్టించవచ్చని అన్నారు. తద్వారా భవిష్యత్తులో చెత్త, వ్యర్థాలు వంటి మాటలు వినబడవని అభిప్రాయపడ్డారు. ప్లాస్టిక్, పునర్వినిమయ వస్తువులతో అనారోగ్యాలకు గురవుతున్నామని, వాటికి స్వస్తి పలకాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో స్వచ్ఛ అభియాన్, స్వచ్ఛ సంకల్ప్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అందరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తమ ఇంట్లో, వీధిలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే తద్వారా మార్పు అనేది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ స్వచ్ఛత దిశగా స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ సహకరిస్తుందని, దీనిలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఎన్‌జిఒలు, వివిధ సంస్థలు, సంఘాలు, ప్రజలు ముందుకు అడుగులు వేయాలని, అప్పుడే ఇది సాధ్యపడుతుందని ఆయన వివరించారు. జట్టు ఆశ్రమం వ్యవస్థాపకులు వెలిగొండ్ల పద్మజ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఈ వారసత్వాన్ని ఇవ్వకుండా స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసి, స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగస్వాములు అవుదామని పిలుపునిచ్చారు. ఇండియన్ గ్రీన్ సర్వీస్‌లో సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, కన్సల్టెంట్ సి.శ్రీనివాసన్ గార్బేజ్ టు గోల్డ్‌పై అవగాహన కల్పించారు. వ్యర్థాలను సేంద్రీయ, అకర్బన భాగాలుగా విభజించడం దేశం యొక్క చెత్త సమస్యను పరిష్కరించడంలో సహాయ పడుతుందన్నారు. సేంద్రీయ వ్యర్థాలను కంపోస్ట్ కోసం ఉపయోగించవచ్చని, అకర్బన వ్యర్థాలను రీసైకిల్ చేసి ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ప్రణాళికాబద్ధమైన వ్యర్థాల నిర్వహణతో సంపదను సష్టించవచ్చని అన్నారు. మున్సిపాలిటీలు చెత్తను రీసైక్లింగ్ చేయడం, తిరిగి ఉపయోగించడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని, బెంగళూరులో చెత్త నుంచి ఏడాదికి రూ.1,500 కోట్ల ఆదాయం కార్పొరేషన్ ఆర్జిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ప్రకతిని అనుసరించాలని, పొడి చెత్తను కాల్చడం వల్ల వాయు కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. అదే వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చవచ్చని, తద్వారా ఆదాయం సమకూరుతుందని వివరించారు. సదస్సులో జిల్లా అధికారులు, ఎన్‌జిఒలు, వివిధ సంస్థలు, సంఘాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పెద్దమడి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎం.కృపాసింధు ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్‌లోనూ, పూతికవలస ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎస్.నైమిష షాట్ పుట్ విభాగంలో, సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎస్.సమిత ట్రిపుల్ జంప్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఒక్కొక్కరికి రూ.2వేలు విలువ చేసే షూలను పిఒ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి మన రాష్ట్రానికి, సీతంపేట ఐటిడిఎకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న పిఒ యశ్వసంత్‌కుమార్‌రెడ్డి

సిఎంను కలిసిన మన్యం ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, రాష్ట్రమంత్రి, సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి శాసనసభ సమావేశాలు అనంతరం మర్యాదపూర్వకంగా కలిశారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని శాసనసభ విప్‌గా నియమించడం పట్ల సిఎంకు అభినందనలు తెలిపారు. జిల్లాలోని నియోజకవర్గాల్లో ఉన్న కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గాల్లో సమస్యలు, చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణ వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. మరింత కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యేలకు సిఎం ఈ సందర్భంగా సూచించారు.

సిఎం చంద్రబాబుకు పూలబొకెను అందజేస్తున్న మన్యం జిల్లా ఎమ్మెల్యేలు

అప్రమత్తంగా ఉందాం... ప్రమాదాలను నివారిద్దాం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తద్వారా ప్రమాదాలు నివారించవచ్చని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక అన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద యువజన సర్వీసులు, రవాణా శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అప్రమత్తత ప్రమాదాలు నివారణకు కీలకమన్నారు. కుటుంబాలను గుర్తించుకొని వాహనాలను నడపాలని ఆమె కోరారు. కుటుంబ యజమానికి ప్రమాదవశాత్తూ ఏం జరిగినా కుటుంబం చిన్నాభిన్నమవుతుందని పేర్కొన్నారు. కావున ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని ఆమె సూచించారు. రహదారి నియమాలు పాటించాలని, గ్రామాల మధ్య, మలుపులు, గుట్టలు ఎక్కే సమయంలో నెమ్మదిగా వెళ్లాలని ఆమె పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలపై అవగాహనకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రవాణా శాఖ సిబ్బంది సహకారంతో ఈనెల 14 వరకు జిల్లాలో సాలూరు, పాలకొండ, పార్వతీపురం, కురుపాంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నిర్వహణలో భాగంగా శిరస్త్రాణం అవశ్యకత తెలియజేస్తూ ప్రజలకు, యువతకు ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను వివిధ ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యువజన సర్వీసులు శాఖ అధికారి బి రామగోపాల్, ఇన్ ఛార్జ్ జిల్లా రవాణా అధికారి ఎం శశి కుమార్, నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వేణుగోపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ శోబిక

పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేయండి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కొమరాడ మండలంలోని పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అసెంబ్లీలో ప్రస్తావించారు. గత కొన్నేళ్లుగా ఈ వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. గిరిజన ప్రాంతంలో ఫారెస్ట్ క్లియరెన్స్ చేయా లన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఏజెన్సీలో డోలీ కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఎక్కువ శాతం మంది గిరిజనులు సికిల్ సెల్ ఎనీమియా రక్తహీనత కారణంగా అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోగ్య కేంద్రాల్లో బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

వబ్బంగిలో ఇంటింటి సర్వే చేస్తున్న మలేరియా అధికారులు

ప్రతీ మలేరియా కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి మలేరియా కేసును గుర్తించి నమోదు చేయాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పిహెచ్‌సి పరిధిలో గల సాకి, తియ్యాలి, తియ్యాలిగూడ, వబ్బంగి, కాకిలి గ్రామాలను బుధవారం సందర్శించి ఆయా గ్రామాల్లో ప్రస్తుతం మలేరియా, డెంగీ వ్యాధుల పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి నిల్వలను తొలగించాలని, దోమల బ్రీడింగ్ పెరగకుండా తగిన విధంగా అవగాహన కల్పించాలని ఎఎన్‌ఎంలకు, ఆశాలకు సూచించారు. నీటి నిల్వలు లేకుండా ప్రతి ఇంటికి ఇంకుడు గొయ్యిని నిర్మించుకొనేలా ప్రజలకు సూచించాలన్నారు. అనంతరం పిహెచ్‌సిని సందర్శించి వార్డులను తనిఖీ చేశారు. జ్వరాల కేసులను గురించి వైద్యాధికారి డాక్టర్ అభినయ్ ల్యాబ్‌లో జరుగుతున్న వివిధ పరీక్షలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మోహన్, అప్పల నాయుడు, సూపర్ వైజర్ శ్రీహరి, స్థానిక ఎఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశాలు వర్కర్లు పాల్గొన్నారు.

జగదీశ్వరి నియామకం అభినందనీయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని అసెంబ్లీ విప్‌గా నియమించడం పట్ల టిడిపి అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు హర్షం వ్యక్తం చేశారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమెను శాసనసభ విప్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేల్లో జగదీశ్వరికే విప్ పనిచేసే అవకాశం దక్కడం అభినందనీయమన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో మన్యం జిల్లాలో ఒకటి కూడా కేటాయించకపోవడం విచారకరం అన్నారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతానగరం

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలు జరిగే సమయంలో ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చుని, కావున హెల్మెట్ వాడకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని పణుకుపేట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేసి అనంతరం హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ పెట్టుకుంటే ప్రమాదాల నుంచి సురక్షితంగా బయటపడే అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధానంగా నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయన్నారు. మోటార్ వెహికల్ చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీను, లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మే 12 నుంచి పాచిపెంట గ్రామదేవత పండగ

ప్రజాశక్తి - పాచిపెంట

పాచిపెంట గ్రామ దేవత నూకాలమ్మ తల్లి పండగ 2025 మే 12,13,14 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు బుధవారం ప్రకటించారు. నూకాలమ్మ దేవత ఆలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసి పై తేదీల్లో గ్రామ దేవత పండగ జరిపేందుకు నిశ్చయించారు. 15ఏళ్ల క్రితం ఈ పండగ జరిగింది

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని మోదుగ, పొలంవలస, ఆలూరు, బోడికొండ అంగన్వాడీ కేంద్రాలను బుధవారం ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా టేక్ హెూం, రేషన్ పంపిణీ ఎలా జరుగుతుందని, పంపిణీ జరిగే హెూమ్ రేషన్‌ను ఎలా వినియోగించుకుంటున్నారు, అలాగే తల్లులు, పిల్లల ఆరోగ్యం, పిల్లల పోషణ పరిశుభ్రతల గురించి అంగన్వాడీ కేంద్రాల గర్భిణులకు, బాలింతలకు చిన్నారులకు అవగాహన కల్పించారు. పొలంవలస అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ రాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక పోలీస్ స్టేషన్‌ను పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కేసులకు సంబంధించిన ఫైళ్లు తనిఖీ చేశారు. పరిసరాలు పరిశీలించారు. మహిళా పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వై అమ్మనరావు, పోలీసులు పాల్గొన్నారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

సీతానగరం : మండలంలోని పణుకుపేటలో బెల్ట్ నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, ఆయన నుంచి 13 మద్యం సీసాలు స్వాధీనపర్చుకున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. తమ స్టేషన్ పరిధిలో గల గరుగుబిల్లి, బలిజిపేట, సీతానగరం మండలాల్లో ఎటువంటి బెల్ట్ షాపులు, నాటుసారా విక్రయాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ, నాటు సారాయి అమ్మకాలు సమాచారం 9440902373 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పార్వతీపురం : గిరిజన గర్భిణుల వసతి గృహం సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవకు సిబ్బందితో కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులు వచ్చినప్పుడల్లా గిరిజన గర్భిణుల వసతి గృహాలు పరిశీలించిన సేవలు బాగున్నాయని మెచ్చుకుంటున్నారని చెప్పారు. కానీ అక్కడ సేవలు చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేదని రంజిత్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఉద్యోగాలకు ప్రభుత్వం పోస్టులు మంజూరు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే సిఎఫ్ఎంఎస్‌లో బకాయి ఉన్న 12నెలల జీతాలు, గతంలో బకాయి పడ్డ 21నెలల సంబంధించిన సగం జీతాలు ఇవ్వటానికి చర్యలు తీసుకోవాలని పిఒను కోరారు. పిఒ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టిఎస్ఎఫ్ నాయకులు పాలవలస భగవాన్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

వీరఘట్టం : చెడు చూడకు, చెడు వినకు, క్రమశిక్షణతో చదువుకోవాలని స్థానిక ఎస్సై జి.కళాధర్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఎస్.గోపాలపురం లో మౌంట్ ఫోర్ట్ పాఠశాలలో బుధవారం విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. చెడు అలవాటు వల్ల భవిష్యత్తు నాశనంతో పాటు తల్లిదండ్రులకు కూడా చెడ్డ పేరు వస్తుందన్నారు. ఈ విధంగా కాకుండా ఉన్నత శిఖరాలు అవలంభించేందుకు చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. మత్తు పానీయాలు వంటి పదార్థాల వల్ల జీవితాలు రోడ్డు ఎక్కుతున్నాయని, ఆ విధంగా తల్లిదండ్రులకు సుబుద్ధులు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ పరిధిలోని సచివాలయాల పరిధిలో గల గ్రామాల్లో నిర్వహించిన నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్(అంతర కుసుమం), టేరిజియం(కొయ్యకండ) లోపం ఉన్న వారిని బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి పుష్పగిరి, జెమ్స్ హాస్పిటళ్లకు శస్త్ర చికిత్సలు తరలించామని జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నేత్ర వైద్యాధికారి కృష్ణారావు, కంటి వైద్యసహాయకులు రమేష్, ఆరోగ్యమిత్రలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.



సిడిపిఒకు వినతిని అందజేస్తున్నఅంగన్‌వాడీ నాయకులు

మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర కోరారు. బుధవారం వారు ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్ లుగా మారుస్తూ జీవో విడుదల చేయాలని కోరారు. గ్రేడ్-2 సూపర్ వైజర్లుగా మినీ అంగన్వాడీలకు అవకాశం కల్పించాలని కోరారు. సర్వీసులో వుండి చనిపోయిన వారికి మట్టి ఖర్చులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీదేవి, సరస్వతి పాల్గొన్నారు.

సాలూరురూరల్ : అంగన్వాడీ మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ జిఒలు ఇవ్వాలని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మికి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మినీ వర్కర్లకు జీతాలు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన ఇచ్చిన అమలు చేయలేదని, సెలవులు కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మె కారణంగా మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చుతామని జిఒ ఇచ్చినా అమలు చేయలేదని అన్నారు. పై సమస్యలన్నీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గౌరీశ్వరి, శశికళ, మినీ వర్కర్స్ యూనియన్ నాయకులు నిర్మల, ఇందిర, అంగన్వాడీ వర్కర్స్ గౌరవ అధ్యక్షులు ఎన్ వై నాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతంపేట

వీరఘట్టంలో గ్రంథాలయ వారోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఈనెల 14 నుంచి స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్స వాలకు సబ్ కలెక్టర్ ప్రాజెక్టు ఆఫీసర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను ఇస్తూ కార్యక్రమాలకు ఆహ్వానించినట్టు గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మిఠాయిలు పంపిణీ, 15న పుస్తకప్రదర్శన, సభ్యత్వ నమోదు, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న వారి స్మరణ, 17న కవి సమ్మేళనం, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 18న యువత పై మాదక ద్రవ్యాల ప్రభావం అనే అంశం పై వ్యాసరచన పోటీలు, 19న ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, మహిళా దినోత్సవం, ముగ్గుల పోటీలు, 20న 57వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్ర మాలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో విజేత లకు బహుమతులు ప్రదానం ఉంటుందని అన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి 57వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రరియన్ సుకన్య తెలిపారు. వారం రోజుల పాటు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి వార్తాపత్రికలు, కథల పుస్తకాలు, పోటీ పరీక్షలు సమాచారం చదివి విజ్ఞాన పెంపొందించుకోవాలని ఆమె కోరారు.

వీరఘట్టం: స్థానిక గ్రంథాలయం లో ఈనెల 14 నుంచి నిర్వహించనున్న గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయాలని గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 14న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, 16నుంచి 19వరకు విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, 20న ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానంతో పాటు ముగింపు కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

నెల్లికెక్కువలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని నెల్లికెక్కువలో ఎస్ సొసైటీ సహకారంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 26 మందిని శస్త్ర చికిత్స కోసం విజయనగరం తరలించారు. శస్త్ర చికిత్స పూర్తి చేసి తగిన మందులు, కళ్లద్దాలు ఉచితంగా ఇచ్చి మూడు రోజుల తర్వాత తిరిగి స్వస్థలాలకు తీసుకొస్తామని పుష్పగిరి సిఎస్ఆర్ హెడ్ ఆనంద్, చిన్న కరణ్ తెలిపారు. కంటి వైద్య శిబిరం ఏర్పాటుకు సహకరించిన ఎస్ సొసైటీకి, సర్పంచ్ సోములు, యువజన సంఘం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోవు రోజుల్లో మారుమూల గిరిజన గ్రామాల్లో మరిన్ని శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, పుష్పగిరి ఆసుపత్రి మేనేజర్ రమాదేవి, బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ భీమశంకర్, వైద్యులు గాయత్రి ,పూజిత, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ నేరాలు, మహిళా భద్రతపై విద్యార్థులకు, యువతకు అవగాహన ఉండాలని స్థానిక ఎస్సై పి.నారాయణరావు సూచించారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళా భద్రత, ఇతరత్రా నేరాల పట్ల అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉన్నప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు డి-మార్ట్, యాక్సిస్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంఎస్ఎన్ ల్యాబ్ వివిధ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగ యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి కొన్ని రోజులు ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చి సంబంధిత కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగ కల్పనా అధికారి కల్పన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో యువతీ యువకులు జాబ్ మేళాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్ర మంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ రామయ్య ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకం

ప్రజాశక్తి -వీరఘట్టం

ఆయిల్ ఫామ్ సాగు చేస్తే రైతులకు ఎంతో లాభదాయకమని హార్టికల్చరల్ ఎఒ టి.అమరేశ్వరి రైతులకు సూచించారు. మండలంలోని కంబరవలసలో రైతులతో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం లో మాట్లాడారు. శ్రీనివాస్ పామ్ ఆయిల్ కంపెనీ మేనేజర్ వీరబాబు మాట్లాడుతూ నాణ్యమైన, అధిక నాణ్యమైన అధిక దిగుబడులు ఇచ్చే మొక్కలను సరఫరా చేస్తామన్నారు. రాయతీపై మొక్కలు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విఎఎలు, ఫీల్డ్ సూపర్వైజర్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర కీలకమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సహకార వారోత్సవాలు సంఘాల బలోపేతానికి దోహదపడుతుందన్నారు. ఈనెల 14 నుంచి నిర్వహించనున్న సహకార వారోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న 71వ అఖిల భారత సహకార వారోత్సవాలకు సంబంధించిన ప్రచార గోడ పత్రికను కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకార సంఘాలు ఎంతో దోహదపడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకార్ సే సమృద్ధి యోజన ద్వారా ఇప్పటికే పలు కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి జన ఔషధి ద్వారా జిల్లాలో జనరిక్ మందుల కేంద్రాలను ప్రారంభించిందన్నారు. మూడు పెట్రోల్ బంకుల నిర్వహణను సహకార సంఘాలకు అప్పగించడంతో పాటు గిడ్డంగుల నిర్వహణ జరిగిందని చెప్పారు. సహకార సంఘాల కార్యకలాపాలను ఎప్పటి కప్పుడు తెలుసుకునేందుకు జిల్లాలోని అన్ని సహకార సంఘాలకు సంబంధించిన డేటాను అన్‌లైన్‌లో పొందపరచడం అభినందనీయమ న్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14న సహకార శాఖ ద్వారా అమలు చేసే నూతన కార్యక్రమాల గురించి వివరించడం, 15న నూతన ఆవిష్కరణలు, సాంకేతికత సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థల వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, 19న మహిళలు, యువత, బలహీనవర్గాలకు సహకారంలో సహకార సంఘాల పాత్ర, 20న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించి సహకార సంఘాల బలోపేతానికి కషిచేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పి. శ్రీరామ్మూర్తి, సిపిఒ పి.వీర్రాజు, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

న్యుమోనియా నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

పిల్లల్లో న్యుమోనియా లక్షణాలను గుర్తించి, నివారణా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి సూచించారు. శ్వాస సంబంధిత సమస్యలను పిల్లల్లో గుర్తించే సర్వేకు సంబంధించిన సాన్స్ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయపార్వతి మాట్లాడుతూ ఇదేళ్లలోపు పిల్లల్లో సంభవించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో న్యుమోనియా తీవ్రమైందని, వ్యాధి లక్షణాల ద్వారా సులభంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. పిల్లల్లో న్యుమోనియా తదితర శ్వాస సంబంధిత సమస్యలు నియంత్రణకు వైద్యారోగ్య శాఖ సాన్స్ ప్రోగ్రాం ప్రవేశపెట్టారని, ఇప్పటి నుండి వచ్చే ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగుతుందని, వైద్య సిబ్బంది సర్వే చేసి న్యుమోనియా లక్షణాలున్న పిల్లలను సత్వరమే గుర్తించి తగు చికిత్స అందజేయాలని అన్నారు. వాతావరణ మార్పులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండటం, పోషకాహారం సరిగ్గా తీసుకోకపోవడం, పొగ దగ్గర ఎక్కువ సేపు ఉండటం ద్వారా వ్యాధి తీవ్రమవుతుందన్నారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేసి పిల్లల్లో న్యుమోనియా నివారణా చర్యలు చేపట్టి ఆరోగ్యవంతమైన బాల్యాన్ని అందజేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం. నారాయణరావు మాట్లాడుతూ పిసివి వ్యాక్సిన్ మూడు డోసులు షెడ్యూల్ ప్రకారం తప్పనిసరిగా పిల్లలకు వేయాలని, న్యుమోనియా నియంత్రణలో కీలకమైందని సూచించారు. సర్వే నివేదికలను సంబంధిత శాన్స్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, ఎం.వినోద్, డా పి.శ్రీధర్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుకు భరోసా ఏదీ? : సిపిఎం

ప్రజాశక్తి -కొమరాడ

మొక్కజొన్న పండించే రైతులకు భరోసా లేదానని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. మండలంలోని చినకేర్జీల పంచాయితీ సీసాడవలసలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం సాంబమూర్తి, రైతు సంఘం నాయకులు ఉపేంద్ర మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారుల చేతిలో మోసపోయి తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేసేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ విషయంపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - కొమరాడ

15 నుంచి 50ఏళ్లలోపు గల నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎపిఎం సురేష్‌బాబు ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల పరిధిలో పలువురు మహిళలకు శిక్షణ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ మొదటి రోజు 15 గ్రామాలకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారికి చదువుపై ఆసక్తి, అలాగే శ్రద్ధగా నేర్పించే కార్యక్రమమే ఉల్లాష్ ఉద్దేశమన్నారు. ప్రతి గ్రామైక్య సంఘాల పరిధిలో 30 మంది చొప్పున నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. యువతతో డిజిటల్ పద్ధతిలో చదువు నేర్పించడం జరుగుతుందన్నారు. కావున ప్రతి నిరక్షరాస్యులైన మహిళలు సమయం కేటాయించుకొని చదువు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ జామి నారాయణస్వామి, సిసిలు, విఒఎలు, గ్రామైక్య సంఘాల మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో గ్రామైక్య సంఘ సభ్యులకు ఉల్లాస్‌పై శిక్షణ నిర్వహించారు. అక్షర వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎపిఎం కమల పాండే మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల నిరక్షరాస్యులైన సభ్యులను అక్షరాస్యులుగా తీర్చాలని అన్నారు. కార్యక్రమంలో సిసిలు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ వాలంటీర్లను, విఒఎ లను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాసులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమ న్నారు. కార్యక్రమంలో ఎపిఎం కె.రాము, సిసి వై.ఆనందరావు, విఒఎలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని
అంబేద్కర్ విగ్రహానికి 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

104 వైద్య సేవలను పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ ద్వారా అందించాలని, తమ డిమాండ్లు పరిష్కరించాలని104 ఉద్యోగులసంఘం జిల్లా అధ్యక్షులు డక్రు ఆనందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కోర్టు దగ్గర గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజ శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 104 వాహనాలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, 104 సర్వీసులో పనిచేస్తున్న డిఎస్సీఆర్వోఆర్ ద్వారా నియమించి సుదీర్ఘంగా సేవలందిస్తున్న 326 మంది సీనియర్ డ్రైవర్లను ఇతర వైద్య శాఖలలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని డిమాండ్ చేశారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని, 2020లో విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగులకు భద్రత కల్పించి జీవో 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. అరబిందో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇవ్వకుండా ఉన్న ఇంక్రిమెంట్లు ఎరియర్ల రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు రావాల్సిన పిఎఫ్, ఇఎస్ఐలు యాజమాన్యం వాటా యాజమా న్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు వసూలు చేసిన యాజమాన్యం వాటా ఇప్పించాలని, జీవో 44, 59 ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ గతంలో పాత యాజమాన్యమే కట్టిందని తెలిపారు. 104 ఉద్యోగులుకు ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని, వాహనాల ఫిట్, ఇన్సూరెన్స్ వెంటనే చేయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ చేయించాలని ఉద్యోగులకు యాజమా న్యం నుంచి రావాల్సిన ఇతర బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకొని 104 ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, సంతోష్, శంకరావు ఉన్నారు.

మాదకద్రవ్యాల మత్తులో పడొద్దు : సిఐ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

యువత మాదక ద్రవ్యాల మత్తులో పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పట్టణ సిఐ వి.నారాయణరావు అన్నారు. బుధవారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉన్నత చదువులపై మాత్రమే దృష్టి పెట్టాలని, అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లకూడదని, మాదకదవ్యాల వినియోగానికి పాల్పడవద్దని, సైబర్ నేరాలకు పాల్పడవద్దని, మహిళల పట్ల సోదర భావంతో మెలగాలని, వారిని వేధింపులకు, హింసకు గురి చేయవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టం నుంచి తప్పించుకోవడం జరగదని శిక్షార్హులు అవుతారని అన్నారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా, అధిక ధరలు, నిరుద్యోగంపై స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేయనున్నామని, ఈ ధర్నాలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని డంగభద్ర, కుమ్మరిగుంట, రాజ్యలక్ష్మీపురం, శివిని, విక్రాంపురం గ్రామాల్లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు పంచుతూ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు హెచ్ రామారావు, నాగభూషణ, మీసాల సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాల వల్ల నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితులు ఏర్ప డుతున్నాయని అన్నారు. నిరుద్యోగ సమస్య పెంచేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, ప్రంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా దళార్లు, మిల్లర్లు చేతిలో రైతులు మోసపోయేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని విమర్శించారు. ఈ సమస్యలన్నింటిపైనా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

డ్రైవర్ మృతిపై అనుమానాలు?

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని యువ డ్రైవర్ లంకెన సాయి (21) మంగళవారం రాత్రి దుగ్గేరు రోడ్డులో జోడిగెడ్డల సమీపాన మోటార్ వెహికల్ ప్రమాదంలో గాయపడినట్ల తెలిసింది. అతడ్ని పార్వతీపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ నుండి విజయనగరం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం సాయి మృతి చెందినట్లు తెలిసింది. మృతునిది పాచిపెంట మండలం కొత్తవలస. మక్కువ తమ బంధువుల వద్ద ఉంటున్నాడు. ఇదిలా ఉండగా సాయి మృతి చెందిన విషయంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మోటార్ వెహికల్ ప్రమాదంలో మృతి చెందాడా? లేక ఇంకేమైనా మిస్టరీ చోటు చేసుకుందా..? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మగడ్డితో అధిక లాభాలు : ఎఒ

పాచిపెంట : రైతులు సాంప్రదాయ పంటలైన పత్తి వంటి పంటలను విడిచిపెట్టి నిమ్మగడ్డి లాంటి పంటలను సాగు చేస్తున్నట్లయితే అధిక లాభాలు వస్తాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని నీలంవలసలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతూ నీటి సదుపాయం ఉంటే ఎలాంటి నేలలోనైనా నిమ్మ గడ్డిని పెంచవచ్చున్నారు. 100 ఎకరాల వరకు సాగు చేసినట్లయితే నూనె తీసే యంత్రం కూడా ఉచితంగా కాబట్టి రైతులు అంతా ఆ దిశగా ఆలోచించుకొని ఒకే ప్రాంతంలో కమ్యూనిటీ బోర్వెల్స్ తీయించుకుని నిమ్మ గడ్డి సాగు చేసుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని కోరారు అంతేకాకుండా భూమిని పాడు చేసే ఎలాంటి కలుపు మందులు పంటల్లో వాడరాదన్నారు. దీనివల్ల దిగుబడి తగ్గడమే కాకుండా భూమి కూడా పాడవుతుందని అన్నారు. కావున సాధ్యమైనంత వరకు అంతర్ కృషి పవర్ వీడర్ లేదా కూలీల సహాయంతో చేయించుకోవాలని కోరారు. ఏక పంటలను విడనాడి బహుళ పంటల విధానాన్ని అవలంబించాల న్నారు. ఏ ఇతర పంటల కంటే ఈ విధానం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అనంతరం చోడి, వరి పంటల క్షేత్రాలను సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచి కొర్ర బుచ్చిబాబు, విఎఎ సాయి గణేష్, ప్రకృతి సేద్య సిఆర్పి సూర్యారావు, ఐసిఆర్ పి.సుకరమ్మ పాల్గొన్నారు.

పేదల కడుపు కొట్టడమే టిడిపి పని : సిపిఎం

ప్రజాశక్తి - బలిజిపేట

ఎంపిడిఒకు వినతిని అందజేసిన బాధితులు

పేదల కడుపు కొట్టడమే టిడిపి నాయకులకు సరైన పద్ధతి కాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు యమ్మల మన్మధరావు విమర్శించారు. రాజకీయ కక్షతో నియోజకవర్గంలో ఎక్కడ చూసినా తొలగింపులు, ఉద్యోగులపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని, వీటిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇందుకు నిదర్శనం మండలంలోని నారాన్నాయుడు వలసలో సుమారు 7గురి పెన్షన్లు తొలగించడమేనన్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ విజయలక్ష్మికి పెన్షన్ పునరుద్ధరించాలని వినపత్రం బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారన్నాయుడువలసలో కంది గౌరీ శంకర్రావు, చల్లా పాపమ్మ, బోను సింహాచలం, లండ సింహాచలం, నాగళ్ల అప్పడు, చిన్ని అప్పల నరసయ్య,కొప్పిశెట్టి పారయ్య పింఛన్లను రాజకీయకక్షతో నిలిపి వేశారన్నారు. ఏ ఆధారమూ లేక జీవనం సాగిస్తున్న వీరిని అర్హులుగా గుర్తించి గత కొన్నేళ్లుగా సామాజిక భద్రత పింఛన్లు అందుకుంటున్నారు. ఇటీవల రాజకీయ కక్షలతో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కుంటిసాకులు చూపిస్తూ వీరి పింఛన్లు నిలిపివేశారన్నారు. నిలిపివేసిన పింఛన్లు ఇవ్వకపోతే ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిని అందజేసిన వారిలో బాధితులు పాల్గొన్నారు.